# తిమోతికి
# వ్రాసిన మొదటి పత్రిక

1 మన రక్షకుడైన దేవుని, మన నిరీక్షణయైన క్రీస్తు యేసు ఆజ్ఞ
వలన క్రీస్తు యేసు యొక్క అపొస్తలుడైన పౌలు,
2 విశ్వాసంలో నాకు నిజ కుమారుడైన తిమోతికి వ్రాయునది:
మన తండ్రియైన దేవుని నుండి, మన ప్రభువైన క్రీస్తు యేసు
నుండి నీకు కృపా కనికరం సమాధానాలు కలుగును గాక.

## అబద్ధ బోధకులను వ్యతిరేకించడానికి నియమించబడిన తిమోతి

3 నేను మాసిదోనియా ప్రాంతానికి వెళ్తూ, నేను నిన్ను కోరిన
విధంగా, నీవు ఎఫెసు పట్టణంలోనే ఉండి, అక్కడ సత్యానికి
విరుద్ధమైన బోధలు చేస్తున్నవారిని అలా బోధించవద్దని,
4 కట్టుకథలపై అంతులేని వంశచరిత్రలపై శ్రద్ధ చూపవద్దని
ఆజ్ఞాపించు. వీటన్నిటి వలన విశ్వాసంతో జరిగే దేవుని పని
ముందుకు కొనసాగే బదులు వాగ్వివాదాలకు దారి తీస్తాయి.
5 ఈ ఆజ్ఞ యొక్క లక్ష్యం ప్రేమ; అది స్వచ్ఛమైన హృదయం
నుండి, మంచి మనస్సాక్షి నుండి, యథార్థమైన విశ్వాసం నుండి
కలుగుతుంది.
6 కొందరు వీటిని విడిచిపెట్టి, అర్థంలేని మాటల్లో పడ్డారు.
7 వారు దేవుని ధర్మశాస్త్ర ఉపదేశకులుగా ఉండాలని అనుకుంటారు,
కాని తాము మాట్లాడే వాటి గురించి లేదా తాము ఎంతో నమ్మకంగా
నొక్కి చెప్పే వాటి గురించి వారికే తెలియదు.
8 ధర్మశాస్త్రాన్ని సరియైన రీతిలో ఉపయోగిస్తే అది మంచిదే అని
మనందరికి తెలుసు.
9 అంతేకాక ధర్మశాస్త్రం నీతిమంతుల కోసం కాదు గాని, చట్టానికి
విరుద్ధంగా ఉన్నవారికి, తిరుగుబాటు చేసేవారికి, భక్తిహీనులకు,

పాపులకు, అపవిత్రులకు, నాస్తికులకు, తమ తల్లిదండ్రులను
చంపేవారి కోసం, హంతకుల కోసం
10 లైంగిక అనైతికత కలిగినవారి కోసం, స్వలింగసంపర్కులకు,
బానిస వ్యాపారం చేసేవారికి, అబద్ధాలు చెప్పేవారికి, దొంగ సాక్ష్యం
చెప్పేవారికి, స్వచ్ఛమైన బోధకు వ్యతిరేకంగా ఉన్న వారి కోసం
నియమించబడిందని మనకు తెలుసు.
11 దేవుడు నాకు అప్పగించిన ఆయన మహిమను గురించిన
సువార్తకు అనుగుణమైనదే, ఈ స్వచ్ఛమైన బోధ.

### పౌలు పట్ల ప్రభువు కృప

12 నన్ను నమ్మకమైన వానిగా తలంచి బలపరచి తన సేవ కోసం
నన్ను నియమించిన, మన ప్రభువైన క్రీస్తు యేసుకు నేను కృతజ్ఞతలు
చెల్లిస్తున్నాను.
13 ఒకప్పుడు నేను క్రీస్తును తెలుసుకోక ముందు విశ్వాసంలో
దృఢపడక ముందు దైవదూషణ చేసేవానిగా, హింసించేవానిగా
దుర్మార్గునిగా ఉన్నాను అయినప్పటికీ దేవుడు నన్ను కనికరించాడు.
14 మన ప్రభువు యొక్క కృప, యేసు క్రీస్తులోని ప్రేమ, విశ్వాసం
నాపై విస్తారంగా క్రుమ్మరించబడింది.
15 క్రీస్తు యేసు పాపులను రక్షించడానికి ఈ లోకానికి వచ్చారనే
మాట నమ్మదగింది పూర్తిగా అంగీకరించదగింది. అలాంటి పాపులలో
నేను అతి దుష్టుడను.
16 అయితే ఆ కారణంగానే, నిత్యజీవాన్ని పొందడానికి ఆయనలో
నమ్మకముంచబోయే వారికి మాదిరిగా ఉండడానికి, అతి దుష్టుడనైన
నాలో క్రీస్తు యేసు తన యొక్క అపరిమితమైన దీర్ఘశాంతాన్ని
చూపించారు.
17 కాబట్టి నిత్య రాజుగా ఉన్న, అమరుడగు అదృశ్యుడైన ఒకే
దేవునికి ఘనత మహిమలు నిరంతరం కలుగును గాక ఆమేన్.

### తిమోతికి తిరిగి బాధ్యతలను అప్పగించుట

18 తిమోతీ, నా కుమారుడా! నీ గురించి ఇదివరకే చెప్పబడిన
ప్రవచనాలు నెరవేరడానికి నేను ఈ ఆజ్ఞ నీకు ఇస్తున్నాను. నీవు
వాటిని జ్ఞాపకం చేసుకుంటూ మంచి పోరాటాన్ని పోరాడు.
19 మనం మంచి మనస్సాక్షిని విశ్వాసాన్ని కలిగి ఉంటేనే
పోరాడగలం, అయితే కొందరు విశ్వాసాన్ని వదిలిపెట్టి తమ
జీవితనావను నాశనం చేసుకున్నారు.
20 అలాంటివారిలో హుమెనేయు, అలెగ్జాండరు అనేవారు
ఉన్నారు. వారిని నేను సాతానుకు వదిలేశాను, అప్పుడు వారు
దేవుని దూషించకుండ ఉండడం నేర్చుకుంటారు.

# 2

## ఆరాధన గురించి సూచనలు

1-2 అన్నిటికంటే ప్రాముఖ్యంగా, నేను మిమ్మల్ని కోరేది ఏంటంటే,
అందరి పక్షంగా అనగా రాజుల కోసం అధికారంలో ఉన్న వారందరి
కోసం దేవునికి విన్నపాలు, విజ్ఞాపనలు, ప్రార్థనలు చేసి కృతజ్ఞతలు
చెల్లిస్తే, మనం పూర్ణ భక్తి, పరిశుద్ధత కలిగి శాంతి సమాధానాలతో
ప్రశాంతంగా జీవించగలము.
3 ఇలాంటివి మంచివి; మన రక్షకుడైన దేవునికి ప్రీతికరమైనవి.
4 ప్రజలందరు సత్యాన్ని తెలుసుకొని రక్షింపబడాలని దేవుడు
కోరుకుంటున్నాడు.
5 ఎందుకంటే, దేవుడు ఒక్కడే; క్రీస్తు యేసు ఒక్కడే మానవునిగా
ఉండి, దేవునికి మానవులకు మధ్యలో ఒక మధ్యవర్తిగా ఉన్నారు.
6 ఆయనే ప్రజలందరి రక్షణ కోసం విమోచన క్రయధనంగా తనను
తాను అర్పించుకున్నారు. దీని గురించి సరియైన సమయంలో సాక్ష్యం
ఇవ్వబడుతుంది.
7 దీని కోసమే నేను ప్రకటించేవానిగా, అపొస్తలునిగా
యూదేతరులకు నమ్మకమైన బోధకునిగా ఉండడానికి

నియమించబడ్డాను, నేను చెప్పేది నిజం నేను అబద్ధం చెప్పడం లేదు.
8 కాబట్టి ప్రతిచోట పురుషులు పవిత్రమైన చేతులను పైకెత్తి, కోపం లేదా కలహభావం లేకుండా ప్రార్థించాలని నేను కోరుతున్నాను.

9 అలాగే స్త్రీలు నిరాడంబరమైన, క్రమమైన వస్త్రధారణ చేసుకోవాలి, విస్తృతమైన కేశాలంకరణ లేదా బంగారం లేదా ముత్యాలు లేదా ఖరీదైన దుస్తులతో కాకుండ,
10 దేవుని పట్ల భక్తి ఉందని అని చెప్పుకునే దానికి తగినట్లుగా మంచి పనులతో అలంకరించుకోవాలని కోరుతున్నాను.

11 ఒక స్త్రీ పూర్ణ వినయంతో శాంత స్వభావంతో నేర్చుకోవాలి.

12 స్త్రీ బోధ చేయడానికి గాని, పురుషునిపై అధికారం చెలాయించడానికి గాని నేను అనుమతించను; ఆమె మౌనంగా ఉండాలి.
13 ఎందుకంటే ఆదాము మొదట సృష్టించబడ్డాడు, ఆ తర్వాత హవ్వ.
14 అంతేకాక, మోసపోయింది ఆదాము కాదు; స్త్రీయే మోసపోయింది పాపిగా అయ్యింది.

15 అయితే స్త్రీలు వివేకం కలిగి విశ్వాసంలో, ప్రేమ, పరిశుద్ధతలో కొనసాగుతూ జీవిస్తే, పిల్లలను కనుట ద్వారా వారు రక్షించబడతారు.

# 3

## సంఘపెద్దలకు, సంఘ పరిచారకులకు ఉండాల్సిన అర్హతలు

1 ఈ మాట నమ్మతగింది: ఎవరైనా ఒక సంఘపెద్దగా ఉండాలని ఆశిస్తే అది మంచి పనిని కోరడమే.
2 సంఘపెద్ద నిందలేనివానిగా, ఒకే భార్యకు నమ్మకమైన భర్తగా, కోరికలను అదుపులో ఉంచుకునేవానిగా, స్వీయ నియంత్రణ గలవానిగా, మర్యాదస్థునిగా, ఆతిథ్య ప్రియునిగా, సత్యాన్ని బోధించగల సామర్థ్యం గలవానిగా ఉండాలి.

3 అతడు త్రాగుబోతై ఉండకూడదు, చేయి చేసుకునేవాడు కాక,
మృదు స్వభావం గలవానిగా ఉండాలి, కొట్లాడేవానిగా, డబ్బును
ప్రేమించేవానిగా ఉండకూడదు.
4 అతడు పూర్తిగా గౌరవించదగిన రీతిలో తన కుటుంబాన్ని చక్కగా
నడిపించుకొంటూ తన పిల్లలు తనకు లోబడి ఉండేలా చూసుకోవాలి.
5 ఒకడు తన సొంత కుటుంబాన్నే సరిదిద్దుకోలేనప్పుడు, అతడు
దేవుని సంఘాన్ని ఎలా చూసుకోగలడు?
6 అతడు నూతన విశ్వాసిగా ఉండకూడదు, ఎందుకంటే అతడు
తన స్థానాన్ని బట్టి గర్వంతో ఉబ్బిపోతాడేమో, సాతాను పొందిన శిక్షకే
అతడు కూడా గురి అవుతాడు.
7 అతడు సంఘస్థులు కాని వారి దగ్గర కూడా మంచి సాక్ష్యం
కలవాడై ఉండాలి, అప్పుడు అతడు నిందల పాలు కాడు, సాతాను
వలలో చిక్కులో పడడు.
8 అదే విధంగా, సంఘ పరిచారకులు కూడా గౌరవించదగినవారిగా,
నిష్కపటంగా ఉండాలి, మద్యానికి బానిసగా ఉండకూడదు, అక్రమ
సంపాదన ఆశించకూడదు.
9 వారు స్వచ్ఛమైన మనస్సాక్షితో విశ్వాసపు మర్మాలను గట్టిగా
పట్టుకోవాలి.
10 వారు ఖచ్చితంగా మొదట పరీక్షించబడాలి; ఏ దోషం లేనివారిగా
నిరూపించబడితేనే వారు సంఘపరిచారకులుగా సేవ చేయవచ్చు.
11 అదే విధంగా, సంఘపరిచారకుల భార్యలు కూడా
గౌరవించదగినవారిగా ఉండాలి, ద్వేషంతో మాట్లాడేవారిగా
కాకుండా కోరికలను అదుపులో ఉంచుకునేవారిగా ప్రతి విషయంలో
నమ్మకమైనవారిగా ఉండాలి.
12 సంఘ పరిచారకుడు తన భార్యకు నమ్మకంగా ఉంటూ, తన
పిల్లలను, కుటుంబాన్ని సరిగా నడిపించేవాడై ఉండాలి.
13 తమ పనులను సక్రమంగా నెరవేర్చే పరిచారకులు ప్రజలమధ్య
ఉత్తమ స్థాయిని పొందుకొని, క్రీస్తు యేసులో వారికున్న విశ్వాసంలో
బహు ధైర్యంగా ఉంటారు.

### పౌలు హెచ్చరికలకు కారణాలు

14 త్వరలో నేను మీ దగ్గరకు రావాలనే నిరీక్షణతో ఈ విషయాలను
వ్రాస్తున్నాను.
15 త్వరలో నీ దగ్గరకు రావాలని ఆశిస్తున్నాను, ఒకవేళ
నేను రావడం ఆలస్యమైనా కాని సత్యానికి పునాదిగా స్తంభంగా
ఉన్న జీవంగల దేవుని సంఘమైన దేవుని గృహంలో ప్రజలు
ఎలా ప్రవర్తించాలో నీకు తెలియజేయాలనే నేను ఈ సూచనలు
వ్రాస్తున్నాను.
16 నిస్సందేహంగా నిజమైన దైవభక్తిని గురించిన మర్మం గొప్పది,
అది ఏంటంటే:

ఆయన శరీరంతో ప్రత్యక్షమయ్యారు,
పవిత్రాత్మ ఆయనను నీతిమంతుడని నిరూపించాడు,
దేవదూతలు ఆయనను చూశారు,
ఆయన గురించి భూరాజ్యాలన్నిటిలో ప్రజలు ప్రకటించారు,
ఆయన గురించి లోకమంతా నమ్మింది,
ఆయనను దేవుడు మహిమలోనికి తీసుకెళ్లారు.

# 4

1 చివరి దినాల్లో కొందరు విశ్వాసాన్ని విడిచిపెట్టి మోసపరచే
ఆత్మలను, దయ్యాలచే బోధించబడే వాటిని అనుసరిస్తారని
పరిశుద్ధాత్మ స్పష్టంగా తెలియజేస్తున్నాడు.
2 కాలుతున్న ఇనుము చేత కాల్చబడిన మనస్సాక్షి కలిగిన
వంచకులైన అబద్ధికుల నుండి అలాంటి బోధలు వస్తాయి.
3 వారు ప్రజలను పెళ్ళి చేసుకోవద్దని నిషేధిస్తారు, సత్యాన్ని
తెలుసుకున్నవారు, నమ్మినవారు కృతజ్ఞతా పూర్వకంగా తినడానికి
దేవుడు సృజించిన ఆహారపదార్థాలలో కొన్నిటిని తినకూడదని వారు
ఆజ్ఞాపిస్తారు.

4 కాని, దేవుడు సృజించిన ప్రతిదీ మంచిదే, కాబట్టి మీరు
కృతజ్ఞతలు చెల్లించి తీసుకుంటే దేన్ని తిరస్కరించాల్సిన అవసరం
లేదు.
5 ఎందుకంటే దేవుని వాక్యం వలన కృతజ్ఞతా ప్రార్థనల వలన అది
పవిత్రపరచబడింది.

6 ఈ విషయాలను సహోదరి సహోదరులకు తెలియజేసినట్లైతే,
నీవు అనుసరించిన విశ్వాస సంబంధమైన సత్యాలు మంచి బోధలలో
పోషించబడి క్రీస్తు యేసుకు మంచి సేవకునిగా ఉంటావు.
7 నిరాధారమైన కల్పితకథలకు, ముసలమ్మల ముచ్చట్లకు
దూరంగా ఉండి, దైవభక్తిలో నీకు నీవే శిక్షణ ఇచ్చుకో.
8 శారీరక వ్యాయామం వలన కొంతవరకు లాభం కలుగుతుంది,
అయితే ప్రస్తుత జీవితానికి రాబోవు జీవితానికి సంబంధించిన
వాగ్దానంతో కూడిన దైవభక్తి అన్ని విషయాల్లో విలువైనది.
9 ఈ మాట నమ్మదగింది పూర్తిగా అంగీకరించదగింది.

10 అందుకే మనుష్యులందరికి, మరి ముఖ్యంగా విశ్వసించిన
వారందరికి రక్షకుడైన సజీవ దేవునిలో మా నిరీక్షణ ఉంచి, మేము
ప్రయాసపడుతూ గట్టిగా కృషి చేస్తున్నాము.

11 ఈ విషయాలను ఆజ్ఞాపించి బోధించు.

12 నీవు యవ్వనస్థుడవని ఎవరు నిన్ను చులకన చేయకుండా
ఉండడానికి నీ మాటల్లో, ప్రవర్తనలో, ప్రేమలో, విశ్వాసంలో,
పవిత్రతలో విశ్వాసులకు మాదిరిగా నడుచుకో.

13 నేను అక్కడికి వచ్చేవరకు నీవు సంఘంలో పరిశుద్ధ వాక్యాన్ని
బిగ్గరగా చదువుతూ, హెచ్చరిస్తూ, బోధించడం మానకుండ జాగ్రత్తగా
చూసుకో.
14 సంఘపెద్దలు తమ చేతులను నీపై ఉంచినప్పుడు ప్రవచనం
ద్వారా నీకు అనుగ్రహించబడిన వరాన్ని నిర్లక్ష్యం చేయకు.

15 ఈ విషయాల్లో నీవు జాగ్రత్తగా ఉండు; నీ అభివృద్ధి అందరికి
స్పష్టంగా కనబడేలా నీవు వాటిని పూర్తిగా ఆచరించు.

16 నీ జీవితాన్ని ఉపదేశాన్ని జాగ్రత్తగా చూసుకో. ఈ విధంగా చేస్తే,
నిన్ను నీ బోధలు వినేవారిని కూడా నీవు రక్షించుకుంటావు.

# 5

## విధవరాండ్రు, పెద్దలు, దాసులు

1 వృద్ధుని కఠినంగా గద్దించకుండా, అతన్ని నీ తండ్రిగా భావించి
ప్రోత్సహించు. నీ కన్నా చిన్నవారిని నీ సోదరులుగా,
2 సంపూర్ణమైన పవిత్రతతో నీ కన్నా పెద్దవారైన స్త్రీలను తల్లులుగా,
నీ కన్నా చిన్నవారైన స్త్రీలను చెల్లెళ్ళుగా చూడు.
3 నిజంగా అవసరంలో ఉన్న విధవరాండ్రకు సరియైన గుర్తింపు
ఇవ్వు.
4 కాని ఏ విధవరాలికైన పిల్లలు గాని మనుమలు గాని ఉంటే,
ఆ పిల్లలు ముందుగా తమ కుటుంబంపట్ల శ్రద్ధ వహించడం, తమ
తల్లిదండ్రులను వారి తల్లిదండ్రులను గౌరవించడం ద్వారా తాము
పాటించే ధర్మాన్ని ఆచరణలో పెట్టడం నేర్చుకోవాలి, ఇది దేవుని
సంతోషపరుస్తుంది.
5 నిజంగా ఒంటరియైన, అవసరంలో ఉన్న విధవరాలు దేవునిపై
ఆధారపడి రాత్రింబగళ్ళు ప్రార్థన చేస్తూ సహాయం కోసం దేవున్ని
అడుగుతూ ఉంటుంది.
6 తన సొంతసుఖాల కోసం జీవించే విధవరాలు జీవించి ఉన్నా
మరణించినట్లే.
7 ఎవరు కూడా నిందించబడకుండా ఉండడానికి ప్రజలకు ఈ
సూచనలన్నింటిని చెప్పు.
8 ఎవరైనా తమ బంధువులకు, మరి ముఖ్యంగా తన సొంత
కుటుంబీకుల అవసరాలను తీర్చలేకపోతే అలాంటివారు విశ్వాసాన్ని
విడిచిపెట్టినట్లే, వారు అవిశ్వాసుల కంటే చెడ్డవారు.
9 ఏ విధవరాలినైనా విధవరాండ్రల జాబితాలో చేర్చాలంటే, ఆమె
అరవై సంవత్సరాలుకు పైబడి, తన భర్తకు నమ్మకంగా ఉండి,

10 తన మంచిపనుల బట్టి సంఘంలో గుర్తింపు కలిగి ఉండాలి,
అనగా పిల్లలను పెంచడం, ఆతిథ్యం ఇవ్వడం, పరిశుద్ధుల పాదాలు
కడగడం, కష్టంలో ఉన్నవారికి సహాయం చేయడం అన్ని రకాల మంచి
పనులు చేయడంలో ముందు ఉండాలి.
11 అయితే యవ్వన విధవరాండ్రను ఆ జాబితాలో చేర్చకూడదు.
ఎందుకంటే, వారు మేము క్రీస్తు కొరకే జీవిస్తామని నిర్ణయాన్ని
తీసుకున్న తర్వాత, తమ శారీరక వాంఛలకు లొంగిపోయి పెళ్ళి
చేసుకోవాలనుకుంటారు.
12 ఈ విధంగా వారు దేవునితో చేసుకున్న తమ మొదటి
ఒప్పందాన్ని నిలుపుకోలేక తమపైకి తామే తీర్పును తెచ్చుకుంటారు.
13 అంతేకాక వారు సోమరులుగా ఇంటింటికి తిరుగుతూ
అనవసరమైన ముచ్చట్లతో, మాట్లాడకూడనివి మాట్లాడుతూ,
ఇతరుల పనులలో జోక్యం చేసుకోవడం అలవాటు చేసుకుంటారు.
14 కాబట్టి యవ్వన విధవరాండ్రకు నేను చెప్పేది ఏంటంటే, వారు
పెళ్ళి చేసుకుని పిల్లలను కని, తమ గృహాలను శ్రద్ధగా చూసుకొంటూ,
తమను నిందించడానికి విరోధికి అవకాశమివ్వకుండా చూసుకోవాలి.
15 అయితే ఇప్పటికే కొందరు దారితప్పి సాతానును
అనుసరిస్తున్నారు.
16 విశ్వాసురాలైన ఏ స్త్రీయైనా తన కుటుంబంలో ఉన్న
విధవరాలి భారాన్ని సంఘంపై పెట్టకుండా, తానే అలాంటి వారికి
సహాయపడుతూ ఉండాలి. అప్పుడు నిజంగా అవసరంలో ఉన్న
విధవరాండ్రకు సంఘం సహాయం చేయ కలుగుతుంది.
17 సంఘాన్ని నడిపించే సంఘపెద్దలు, మరి ముఖ్యంగా వాక్యాన్ని
ప్రకటించేవారు వాక్యాన్ని బోధించేవారు రెండింతల గౌరవానికి
పాత్రులు.
18 దీని గురించి లేఖనాల్లో, "ఎద్దు ధాన్యాన్ని త్రొక్కుతున్నప్పుడు
మూతికి చిక్కం కట్టవద్దు,* పనివాడు జీతానికి పాత్రుడు"† అని
వ్రాయబడి ఉన్నది.

* **5:18** ద్వితీ 25:4 † **5:18** లూకా 10:7

19 సంఘపెద్దపై వచ్చిన నిందను ఇద్దరు లేదా ముగ్గురు సాక్షులు
లేకుండా అంగీకరించకూడదు.
20 అయితే సంఘపెద్దలు ఎవరైనా పాపం చేస్తే, ఇతరులకు
హెచ్చరికగా ఉండడానికి వారిని అందరి ముందు గద్దించు.
21 ఎటువంటి పక్షపాతాన్ని చూపించకుండ, ఎవరి పట్ల భేదం
చూపకుండ నీవు ఈ సూచనలు పాటించాలని, దేవుని ఎదుట క్రీస్తు
యేసు సన్నిధిలో ఎన్నుకోబడిన దేవదూతల ఎదుట నేను నిన్ను
హెచ్చరిస్తున్నాను.
22 ఎవరిపైనా చేతులను ఉంచడానికి తొందరపడకు, ఇతరుల
పాపంలో భాగం పంచుకోవద్దు. నిన్ను నీవు పవిత్రంగా ఉంచుకో.
23 నీకున్న కడుపునొప్పి, నీకు తరచుగా వచ్చే బలహీనతల
కారణంగా కేవలం నీటిని మాత్రమే త్రాగకుండా కొంచెం ద్రాక్షారసాన్ని
కూడా త్రాగు.
24 కొందరి పాపాలు ప్రజల ఎదుట స్పష్టంగా కనబడి, తీర్పు
తీర్చబడే చోటికి వారి కన్నా ముందుగా చేరుకుంటున్నాయి; మరి
కొందరి పాపాలు వారి వెనుక అనుసరిస్తున్నాయి.
25 అదే విధంగా, ఇప్పుడు కొందరు చేసిన మంచి పనులు స్పష్టంగా
కనబడుతున్నాయి, అయితే ఇంకొందరు చేసిన మంచి పనులు
ఇప్పుడు కనబడకపోయినా, అవి చాలా కాలం దాచబడి ఉండవు.

# 6

1 దేవుని నామాన్ని మేము చేసిన బోధలను ప్రజలు దూషించకుండ
ఉండడానికి, దాసులుగా బానిసత్వపు కాడి క్రింద ఉన్న విశ్వాసులైన
వారందరు తమ యజమానులను గౌరవించదగినవారిగా భావించాలి.
2 విశ్వాసులైన యజమానులను కలిగినవారు వారు తమ తోటి
విశ్వాసులే కదా అని అగౌరవంగా ప్రవర్తించకూడదు. పైగా తోటి
విశ్వాసులైన తమ యజమానులు తమకెంతో ప్రియమైనవారని, వారు
తమ దాసుల క్షేమం కోసం నియమించబడినవారని, వారికి మరింత
బాగా సేవలు చేయాలి.

## అబద్ధ బోధకులు ధనాన్ని ప్రేమించేవారు

నీవు ఈ సంగతులు బోధించి విశ్వాసులను ప్రోత్సాహించాలి.
3 మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క మంచి ఉపదేశాలకు మన
దైవభక్తిని పెంచే బోధకు వ్యతిరేకమైన బోధను ఎవరైనా బోధిస్తే,
4 అలాంటివారు వివేకం లేనివారు అహంకారులు. అలాంటివారు,
మాటల వలన కలిగే వివాదాలలో గొడవలలో అనవసరమైన
ఆసక్తి కలిగి ఉంటారు. దాని ఫలితంగా అసూయలు, కలహాలు,
ద్వేషపూరితమైన మాటలు, దుష్ట సందేహాలు కలుగుతాయి,
5 దుష్ట ఆలోచనలు కలిగిన ప్రజల మధ్యలో తరచూ ఘర్షణలు
జరుగుతాయి, అలాంటివారు సత్యం నుండి తొలగిపోయి, దైవభక్తి
అనేది ఆదాయం తెచ్చే ఒక మార్గమని భావిస్తారు.

6 అయితే సంతృప్తితో దైవభక్తి కలిగి ఉండడమే గొప్ప
లాభదాయకము.
7 మనం ఈ లోకంలోనికి ఏమి తీసుకురాలేదు, లోకం నుండి ఏమి
తీసుకెళ్లలేము.
8 కాబట్టి మనం ఆహారాన్ని వస్త్రాలను కలిగి ఉంటే, వాటితో
తృప్తిచెందాలి.
9 అయితే ధనవంతులుగా అవ్వాలని కోరుకునేవారు శోధనలో పడి,
మానవులను పాడుచేసి నాశనం చేసే మూర్ఖమైన ప్రమాదకరమైన
కోరికల వలలో చిక్కుకుంటారు.
10 డబ్బుపై ఉండే ప్రేమ ప్రతి దుష్టత్వానికి వేరు. కొందరు డబ్బును
ఎక్కువగా ఆశించి విశ్వాసం నుండి తొలగిపోయి, తమను తామే
అనేక దుఃఖాలకు గురిచేసుకున్నారు.

## తిమోతికి చివరి బాధ్యత

11 అయితే దైవజనుడవైన నీవు, వీటి నుండి పారిపోయి నీతి, భక్తి,
విశ్వాసం, ప్రేమ, సహనం, మంచితనం అనే వాటిని వెంబడించు.

12 విశ్వాస సంబంధమైన మంచి పోరాటాన్ని పోరాడు. అనేకమంది
సాక్షిసమూహం ఎదుట నీవు చేసిన మంచి ఒప్పుకోలును బట్టి నీవు
పిలువబడిన నిత్యజీవాన్ని చేపట్టు.
13 అన్నిటికి జీవాన్ని ఇచ్చే దేవుని ఎదుట, పొంతి పిలాతు ఎదుట
మంచి సాక్ష్యమిచ్చిన క్రీస్తు యేసు ముందు నేను నీకు నిర్దేశించాను.
14 నీవు మన ప్రభువైన యేసు క్రీస్తు తిరిగి ప్రత్యక్షమయ్యే వరకు
నిందగాని డాగుగాని లేకుండా ఈ ఆజ్ఞలకు లోబడు.
15 రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు, ఏకైక అధిపతిగా
ఉన్న భాగ్యవంతుడైన దేవున్ని తగిన సమయంలో దేవుడు
ప్రత్యక్షపరుస్తారు.
16 ఆయన ఒక్కడే మరణం లేనివాడు, ఆయన సమీపించలేనంత
వెలుగులో నివసిస్తాడు, ఆయనను ఎవరూ ఎన్నడు చూడలేదు,
ఎన్నడు చూడలేరు. అలాంటి దేవునికే ఘనత ప్రభావాలు నిరంతరం
కలుగును గాక ఆమేన్.
17 ఈ లోకంలో ధనవంతులైన వారిని గర్వంతో ఉండవద్దని,
స్థిరంగా ఉండని సంపదలపై తమ నమ్మకాన్ని ఉంచక, వారి సంతోషం
కోసం కావలసిన వాటన్నిటిని సమృద్ధిగా ఇచ్చే దేవునిలోనే నిరీక్షణ
ఉంచమని ఆజ్ఞాపించు.
18 వారు మంచిని చేస్తూ, మంచి పనులు చేయడంలో
ధనవంతులుగా ఇతరులకు ఇవ్వడంలో ధారాళంగా ఉండమని
ఆజ్ఞాపించు.
19 ఈ విధంగా రాబోవు కాలానికి దృఢమైన పునాది కాగల ధనాన్ని
వారు తమ కోసం కూర్చుకుంటారు, అప్పుడు వారు నిజమైన జీవాన్ని
సంపాదించుకోగలరు.
20 తిమోతీ, నీకు అప్పగించబడిన బోధను జాగ్రత్తగా పాటించు.
దుష్టమైన వట్టి మాటలకు, జ్ఞానమని తప్పుగా పిలువబడే విరుద్ధమైన
ఆలోచనలకు దూరంగా ఉండాలి.
21 కొందరు అలాంటి జ్ఞానాన్ని కలిగి ఉన్నామని చెప్పుకుంటూ
విశ్వాసం నుండి తొలగిపోయారు.

కృప నీకు తోడై ఉండును గాక!

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.
You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."
Notice of copyright must appear on the title or copyright page of the work as follows:
Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.
"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.
You must also make your derivative work available under the same license (CC BY-SA).
If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.

You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.

Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025

aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6